పశుగ్రాసం సాగుతో రైతుకు ఆదాయం

పశుగ్రాసం పెంపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



పెనుగొండ మండలంలో పశుగ్రాసం సాగుపై అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖాధికారులు

పెనుగొండ: పశుగ్రాస సాగుతో రైతుకు లాభసాటిగా ఉంటుందంటూ పశుసంవర్ధక శాఖ పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తుంది. గ్రామాల్లో పర్యటిస్తూ పశుగ్రాసం వల్ల కలిగే లాభాలు, తద్వారా పాల దిగుబడి పెరిగి రైతు ఆదాయం మరింత పెరుగుతుందని అవగాహన కల్పిస్తున్నారు. పశు పోషణకు 70 శాతం ఖర్చు పశుగ్రాసానికి అవుతుందని, ఖర్చు తగ్గించడానికి చౌకగా లభ్యమయ్యే పశుగ్రాసాన్ని వాడడం ఉత్తమమని పేర్కొంటూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రశుగ్రాస సాగు వల్ల పోషణ ఖర్చు తగ్గి పాల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో రైతు కుటుంబాల ఆదాయం పెరుగుతుంది. సాధారణంగా రోజుకు ఒక్కో పశువుకు 30 నుంచి 40 కేజీల పచ్చిమేత అవసరమవుతుంది. నీటి వసతి కలిగిచన ఎకరంలో పశుగ్రాసం సాగు చేస్తే వచ్చే పశుగ్రాసంతో నాలుగు నుంచి ఐదు పాడి పశువులకు సరిపోతుంది.

రూ.30 వేలు ఆదాయం

రైతుకు పశుగ్రాసం సాగు వల్ల రూ.30 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అధిక పాలను ఇచ్చే ఐదు నుంచి ఆరు ఆవులను గానీ, గేదేలను గానీ ఎకరం పొలంలో పండించే గ్రాసంతో పెంచవచ్చు. ఇలా చేయడం ద్వారా పాల అమ్మకంతో రైతులకు దాదాపుగా రూ.30 వేలు ఆదాయం లభిస్తుంది. అదే వాణిజ్య పంటలు, ధాన్యం పండిస్తే రైతుకు కేవలం ఎకరానికి రూ.13 వేల నుంచి రూ.15 వేలు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. ఈ విధంగా రైతుకు పశగ్రాస సాగు లాభసాటిగా ఉంటుంది. పశువులను పుష్కలంగా పోషించడం వల్ల 25 శాతం పాలు దిగుబడి పెరిగే అవకాశాలు ఉంటాయి. దీంతో రైతులు అందరూ పశుగ్రాస సాగువైపు మళ్లాలంటూ పశుసంవర్ధక శాఖ విస్తృత ప్రచారం చేస్తుంది. పశుగ్రాసాన్ని తక్కువ సమయంలో తక్కువ పెట్టుబడితో అతి చౌకగా సాగు చేసుకోవచ్చు. పశుగ్రాసాన్ని ప్రత్యేకంగా పెంచితే పశువులు ఇష్టంగా తింటాయి. పశు సంవర్ధక శాఖ సూచించే పశుగ్రాస రకాల్లో మాంసకృత్తులు, పిండి పదార్థాలు, కొవ్వు పదార్థాలు అధికంగా ఉంటాయి. దీని వల్ల పశువుల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

తగ్గిన పిల్లి పేసర, జనుం సాగు

నష్టాలు, వాతావరణ మార్పులతో రబీ పంట తరువాత, ఖరీఫ్ వేయడానికి ముందు సాగు చేసి పిల్లి పెసర, జనుం సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఈ తరుణంలో పశుగ్రాస చెట్లు అయినటువంటి మునగా అవిస సుబాబుల వాడకంతో ఎంతో ఉపయోగం ఉంటుందని ప్రచారం నిర్వహిస్తున్నారు.

రైతుకు లాభం.. పశువుకు బలం

పశుగ్రాసంగా సుబాబులు సాగు వల్ల రైతుకు లాభంతోపాటు, పశువుకు బలం ఉంటుంది. పోషక విలువలు అధికంగా అందడంతో పశు ఉత్పత్తి అధికంగా ఉంటుంది. రైతులు అధిక ఆదాయానికి పశుగ్రాస సాగు మంచి మార్గం.

– డాక్టర్ ప్రమీలా రాణి, పశువైద్య సహాయ సంచాలకులు, పెనుగొండ

సిద్ధాంతంలో అన్న సమారాధన



మావుళ్లమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాల సందర్భంగా మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, ఆలయ పునర్నిర్మాణ కమిటీల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముగింపు సందర్భంగా సుమారు 5 వేల మందికి భారీ అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాలనుంచి భారీగా తరలి వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.

గీత వృత్తిని కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జుత్తిగ నర్సింహమూర్తి

నరసాపురం: ప్రభుత్వం గీత వృత్తిని కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని ఏపీ కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మీరా భవన్‌లో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు భూములు అప్పగించడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బకు గ్రామీణ ప్రాంతాల్లోని తాడి చెట్లు విచ్చలవిడిగా నరుకుతున్నారని వాపోయారు. ప్రస్తుతం గీత వృత్తి సంక్షభంలో ఉందని, తాడిచెట్లు ఉన్నంత వరకే గీత వృత్తి ఉంటుందని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఈ ఏడాది గీత కార్మికుల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు పి.నర్సింహరావు, గుబ్బల విష్ణు, కాగితాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వి.ఉమామహేశ్వరరావు

పెనుమంట్ర: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వి.ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గర్భిణుల రిజిస్టర్లను పరిశీలించి స్థానిక వైద్యాధికారులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నిత్యం గ్రామాల్లో సర్వే చేస్తూ చేస్తూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.లావణ్య, పి.కనకప్రియ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు శేరేపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్

మొగల్తూరు: మండలంలోని శేరేపాలెం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ లక్ష్మీ పార్వతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామంలోని సచివాయంలో నిర్వహించే ఆరోగ్య శిబిరాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారంతో పాటు ప్రయాణికుల నుంచి సూచనలు, సలహాల నిమిత్తం బుధవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్ సుబ్బన్నరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం అయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ కార్గో సేవలు, బస్సు సౌకర్యాలు తదితర అంశాలపై ఉదయం 11 నుంచి 12 గంటలు వరకూ ప్రయాణికులు 99592 25486 నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



డెంగీ నివారణ మాసోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డి.బెన్నీ శామ్యూల్ అన్నారు. మంగళవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బెన్నీ సామ్యూల్ మాట్లాడుతూ డెంగీ దోమల ద్వారా వస్తుందన్నారు. మన పరిసరాల్లో దోమలు పెరిగేందుకు అనుకూలత లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రై డేను బాధ్యతగా నిర్వహించాలన్నారు. యాంటీ లార్వల్ ఆపరేషన్స్ ద్వారా స్ప్రేయింగ్ చేయాలని ఇప్పటికే పీహెచ్‌సీ పరిధిలో అన్ని గ్రామాల్లోనూ దోమల నివారణ మందులు సరఫరా చేశామన్నారు. అలాగే పీహెచ్‌సీ సిబ్బంది జ్వరాల సర్వే తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

భీమవరం: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ భీమవరంలో ఫెడరల్ బ్యాంకు ఉద్యోగులు బ్యాంకు వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బదిలీ పాలసీ, పాత లేబర్ చట్టాలు అమలు చేయాలని, ఖాతాదారులపై ఇన్సూరెన్స్ భారం మోపొద్దని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ జేఏసీ నాయకుడు పి.నాగేశ్వరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, పి.భవితదుర్గ, విశ్వేశ్వరావు, వై.ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలతో ఎంఓయూ

వీరవాసరం: ఎస్ఎంబీటీ ఏపీ అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల, పాలకొల్లులోని శ్రీ విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలో (ఎంఓయూ) భాగంగా మంగళవారం కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు ఉపాధి నైపుణ్యాలలో ప్రావీణ్యం సాధించి, ప్లేస్‌మెంట్స్ పొందడానికి ఈ అవగాహన ఒప్పందం దోహదపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ వలవల నరసింహారావు అన్నారు. కార్యక్రమంలో శ్రీ విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు లాభసాటిగా పాడి పరిశ్రమ

ఆకివీడు: పాడి పరిశ్రమ అభివృద్ధి చెందితేనే రైతులకు లాభసాటిగా ఉంటుందని ఎంపీపీ కఠారి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు పాతపాటి శ్రీనివాసరాజు చెప్పారు. మండలంలోని పెదకాపవరంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూగ జీవుల వేదనను రైతులు గుర్తించి సకాలంలో వైద్యం చేయించాలన్నారు. అధిక పాల దిగుబడి, సూడి కట్టడం వంటి వాటి ద్వారా రైతు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తాదని చెప్పారు. పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ జవహర్ హుస్సేన్ మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు సంబంధించిన గర్భకోశ వ్యాధుల నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. పశు గణాభివృద్ధి కార్యనిర్వాహణాధికారి జేసురత్నం మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సంక్రమించకుండా ముందు జాగ్రత్త చర్యలుగా వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని తెలపారు.రు. కార్యక్రమంలో 90 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 23 పశువులకు అనారోగ్య చికిత్స, 30 లేగ దూడలకు నట్టల నివారణ మందు, 150 పశువులకు గొంతు వాపు వ్యాధి టీకాలు, కోళ్లకు, గొర్రెలకు వ్యాధులు సంక్రమించకుండా యాంటీబయోటిక్ పౌడర్ అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి డాక్టర్ కెల్లా భార్గవీసత్య, వర ప్రసాద్, హేమ, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



మొగల్తూరు: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచి స్వామి వారిని తులసి మాలలు, పూలతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గ్రామస్తులతో ఆలయ అర్చకులు రామాచార్యులు, కిరణ్ ఆచార్యులు సామూహిక పూజలు జరిపించారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య సేవలందిస్తున్న లక్ష్మీభార్గవి

పాలకొల్లు అర్బన్: గర్భిణులు వైద్యుల సలహాలు తీసుకుని సుఖ ప్రసవం కావడానికి జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ లక్ష్మీభార్గవి సూచించారు. మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెడికల్ ఆఫీసర్ అద్దాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రైవేట్ వైద్యురాలు లక్ష్మీభార్గవి గర్భిణులను పరీక్షించి వైద్య సలహాలు ఇచ్చారు. సుగర్, బీపీ, కాళ్లవాపులు సమస్యలు ఉన్న గర్భిణులు పోషకాహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రసవ సమయంలో వారం రోజుల ముందు ఆసుపత్రిలో చేరాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు పోషక విలువలతో కూడిన భోజనం అందించారు. మెడికల్ ఆఫీసర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, సూపర్‌వైజర్లు డి కమల, ఎస్‌కే అమలేశ్వశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను కాపాడుకోవాలి



హరికథ కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో భాగమైన కళల్లో హరికథ ముఖ్యమైందని, అలాంటి మన కళను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని రసధుని అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు అన్నారు. సోమవారం రాత్రి స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో తూర్పు గోదావరి జిల్లా అంబాజీపేటకు చెందిన నేమాని వెంకట నాగలక్ష్మి భాగవతారణి భక్తరామదాసు హరికథను నిర్వహించగా రసధుని సాహితీ సంస్థ సభ్యులు కార్యక్రమంలో భాగంగా ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భాగవతారిణి మాట్లాడుతూ హరికథ వివరాలను సాహితీప్రియులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రసధుని సభ్యులు యర్రంశెట్టి వెంకటరత్నం, మామిడిశెట్టి శ్రీనివాస్, పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, వంగా నరసింహరావు, ముచ్చర్ల శ్రీనివాసరావు, బొండాడ మోహనగుప్త, కొల్లి నరసింహమూర్తి, వి.హరికృష్ణ పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని వినియోగించుకోవాలి



వడలి ఎంపీపీ పాఠశాలలో వికలాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు

పెనుగొండ: వికలాంగ చిన్నారులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ ఫిజియోథెరపిస్టు జగదీష్ అబ్బురాజు అన్నారు. మంగళవారం వడలిలోని ఎంపీపీ స్కూలులోని భవిత కేంద్రంలో సీడబ్ల్యూఎస్ఎన్ చిన్నారులకు ఫిజియోథెరపీ చేశారు. ప్రతి మంగళవారం వడలిలోని ఎంపీపీ పాఠశాలలోని కేంద్రంలో ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా పెనుగొండలోనూ ప్రతి వారం ఫిజియోథెరపీని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు వడలి గ్రామ టీడీపీ అధ్యక్షుడు యు.చంటి కుర్చీలను బహూకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు వాణీ పుణ్యవతి తెలిపారు. కార్యక్రమంలో భవిత స్కూల్ ఉపాధ్యాయురాలు వి.అనంతలక్ష్మీ , విద్యా సాగర్, బీజేపీ మహిళా మోర్చా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రత్యూష అక్కిరాజు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువ అధ్వానం



చినమామిడిపల్లి వద్ద చెత్తతో పూడుకుపోయిన పంటకాలువ

నరసాపురం: పట్టణం మీదుగా చినమామిడిపల్లి–సరిపల్లి మీదుగా వెళ్లే పంట కాలువ అధ్వానంగా తయారైంది. పంటకాలువలో పూడిక పెరిగిపోయింది. అలాగే కాలువ నిండా చెత్త పేరుకుపోయింది. దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని చినమామిడిపల్లి నుంచి కొప్పర్రు వరకు సుమారు 5 వేల ఎకరాల భూములకు, దాదాపు 40 గ్రామాలకు సాగు, తాగునీటి అవసరాలకు ఈ కాలువే దిక్కు. అయితే ఎక్కడిక్కడ చెత్త పేరుకుపోవడంతో నీరుపారడంలేదు. దీంతో శివారు ప్రాంతాలకు నీరు చేరడంలేదు. వేసవిలో కాలువలు కట్టేసి నీరు వదిలిన తరువాత కాలువను శుభ్రం చేయలేదు. ఇప్పటికైనా కాలువ బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



పోడూరులో తహసీల్దార్ మురళీకృష్ణకు వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

పోడూరు: అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పాలకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అంగన్‌వాడీ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షురాలు పీతల రాజమణి డిమాండ్ చేశారు. జూలై 10న అఖిల భారత కోర్కెల దినోత్సవం సందర్భంగా మంగళవారం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక తహశీల్దార్ బీవి మురళీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. బడ్జెట్‌ను పెంచి ఐసీడీఎస్‌లను బలోపేతం చేయాలనీ, అంగన్‌వాడీ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలనీ, ఐఎల్‌సీ సిఫార్సుల ప్రకారం కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలనీ, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, అంగన్‌వాడీ ఉద్యోగులపై రాజకీయ వేధింపులను అరికట్టాలని తదితర డిమాండ్‌లను వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కేతా గోపాలన్, పిల్లి ప్రసాద్, అంగన్‌వాడీ యూనియన్ లీడర్లు దొమ్మేటి భాగ్యలక్ష్మి, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సాగు సందడి



లంకలకోడేరులో సిద్ధంగా ఉన్న వరినారు



పోడూరు మండలం జగన్నాథపురంలో వరినాట్లు వేసిన దృశ్యం

- 95 శాతం నారుమడులు పూర్తి
- వరి నాట్ల పనిలో రైతులు నిమగ్నం

పాలకొల్లు అర్బన్: వరుణ దేవుడు కరుణించాడు. గత పది రోజుల నుంచి వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గత దాళ్వా పంటలో అధిక దిగుబడులు రావడంతో రైతులు ఉత్సాహంగా సార్వా పనులు ప్రారంభించారు. పాలకొల్లు నియోజకవర్గంలో అక్కడక్కడ వరినాట్లు కూడా ప్రారంభమయ్యాయి. దమ్ములు, గట్టులంకల పనుల్లో చేపట్టారు. వరి నాట్లు వేసుకోవడానికి వీలుగా దమ్ము చేసిన చేలను వ్యవసాయ కూలీలతో చదును చేస్తున్నారు. ఇప్పటికే 95 శాతం నారుమడులు పోశారు. మరో రెండు రోజుల్లో నూరుశాతం నారుమడులు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

వేగంగా వరినాట్లు

వర్షాలు కురవడంతో సాగునీరుకి ఇబ్బందులు తలెత్తడం లేదని పలు గ్రామాలకు చెందిన రైతులు చెబుతున్నారు. ఒక ఎకరం వరి నారు 20 ఎకరాల్లో నాట్లు వేసుకోవడానికి సరిపోతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పోడూరు మండలంలో సుమారు 250 ఎకరాల్లో వరినాట్లు పూర్తికాగా, పాలకొల్లు మండలంలో 10 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పూర్తి చేశారు. కొన్ని గ్రామాల్లో నారుమడులు ఏపుగా పెరిగి నాట్లు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. 25 రోజులు దాటిన 30 రోజుల లోపు ఉన్న ఆరోగ్యవంతమైన వరినారును నాట్లుగా వేసుకోవాలని, దీనివల్ల దుబ్బు బాగా చేస్తుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అలాగే వరినారు చివరలు తుంచి నాటు కోవడం వల్ల ఆకు చివర చేరిన పురుగులు నశిస్తాయి. అలాగే చదరపు మీటరుకి 33 మూనలు నాటుకోవాలని సూచిస్తున్నారు.

నారుమడులు పూర్తి



మండలంలో నారుమడులు పూర్తయ్యాయి. వరిచేలను ట్రాక్టర్లతో దుక్కిదున్నుకుంటున్నారు. వేసవి కాలంలో వరి చేలల్లో ట్రాక్టర్లు తిరగడం వలన భూమి గట్టిగా ఉంటుంది. మూడు నుంచి నాలుగు సార్లు దుక్కులు దున్నుకోవాలి. వెంట వెంటనే కాకుండా ఒక సారి దుక్కి దున్ని తరువాత రెండు, మూడు రోజులు ఆగిన తరువాత మరో రెండు దుక్కులు దున్నుకుంటే నేల సారవంతంగా మారుతుంది. శివదేవునిచిక్కాల, వరిధనం గ్రామాల్లో సుమారు 30 ఎకరాల్లో వరినాట్లు వేశారు.

– ఎం.శామ్యూల్ జాన్సన్, వ్యవసాయాధికారి, పాలకొల్లు



దగ్గులూరులో దమ్ము చేస్తున్న దృశ్యం



పాలకొల్లు మండలం వెలివెలలో దమ్ము చేసిన వరిచేను

జేఏఐతోనే టెక్నాలజీకి భవిష్యత్

భీమవరం: టెక్నాలజీ భవిష్యత్ జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(జేఏఐ)పైనే ఆధార పడుతుందని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడు ఉమాదేసు తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రాంప్ట్ ఇంజనీరింగ్' అనే అంశంపై మూడు రోజులు నిర్వహించే వర్క్ షాప్ మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎన్ని టెక్నాలజీలు వచ్చినా భవిష్యత్తులో జేఏఐలో నైపుణ్యం పొందిన విద్యార్థులకు మాత్రమే ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. గతంలో కోడింగ్ వంటి టెక్నాలజీలు కేవలం ఇంగ్లీష్ భాషకే పరిమితమయ్యేవని నూతన టెక్నాలజీ ఏ భాషలోనైనా సమస్యకు పరిష్కారం చూపుతుందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ నూతన టెక్నాలజీని అందుకోవాలంటే నిరంతరం వర్క్‌షాప్‌లు, సెమినార్లతోనే సాధ్యమవుతుందన్నారు. సీఎస్‌సీ హెడ్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం కల్పిస్తున్న అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.